| | | | |
|---|---|---|---|
| Published Date: | 9 Jun 2026 | Publication: | Eenadu (Telugu) [Hyderabad] |
| Journalist: | Bureau | Page No: | 16 |
| Circulation: | 252,000 | | |

బంగారం ఫండ్లలో

# భారీ పెట్టుబడులపై ఆంక్షలు




**● ఫండ్ సంస్థల నిర్ణయం ● ఒక పాన్‌పై నెలకు రూ.10 లక్షలకు అనుమతి**

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయంగా, దేశీయంగా బంగారం ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో, పసిడి పథకాల్లోకి భారీ పెట్టుబడులపై దేశీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలు తాత్కాలిక ఆంక్షలు విధిస్తున్నాయి. నగదు నిర్వహణ, బంగారం కొనుగోళ్లలో ఎదురవుతున్న సవాళ్లు - ధరల్లో ఒడుదొడుకులే ఇందుకు కారణం. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ, నిప్పన్ ఇండియా మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, యాక్సిస్ మ్యూచువల్ ఫండ్, టాటా మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఏకమొత్తం పెట్టుబడులను తాత్కాలికంగా నియంత్రిస్తున్నట్లు ప్రకటించాయి. కోటక్ మహీంద్రా ఏఎంసీ, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ కూడా ఇదే బాట పడతాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. నేరుగా పసిడి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలోకి వచ్చే పెట్టుబడులు రూ.25 కోట్లకు మించితే తీసుకోవడం లేదు. గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్లలోకి వచ్చే పెట్టుబడులకూ పరిమితి విధించాయి. ఒక పాన్ కార్డుపై ఒక క్యాలెండర్ నెలలో గరిష్ఠంగా రూ.10 లక్షల వరకే అనుమతిస్తున్నాయి. ఈ ఆంక్షలకు కారణాలివీ..

## కృత్రిమంగా ధర పెరగకూడదనే

మ్యూచువల్ ఫండ్ నిబంధనల ప్రకారం.. గోల్డ్ ఈటీఎఫ్ లేదా గోల్డ్ ఫండ్ల ద్వారా సేకరించిన ప్రతి రూపాయికీ సమాన బంగారాన్ని (99.5 స్వచ్ఛతతో) ఫండ్ సంస్థలు కొనుగోలు చేసి, కస్టడీలో భద్రపరచాలి. ప్రస్తుతం బంగారం ధరలు అధిక స్థాయుల వద్ద ఉన్నాయి కానీ హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. పసిడి దిగుమతి చేసుకునేందుకు డాలర్లు వెచ్చించాల్సి ఉన్నందున, బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలని స్వయంగా ప్రధానే పిలుపు ఇచ్చిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో రూ. వందల కోట్లు పసిడి ఫండ్లలోకి వచ్చినా, అందుకు సరిపడా బంగారం వెంటనే కొనేందుకు మార్కెట్‌లో అందుబాటులో ఉండటం లేదు. ఈ సంస్థలు భారీగా కొనుగోలు చేస్తే, మార్కెట్‌లో బంగారం ధరలు కృత్రిమంగా పెరిగే అవకాశం ఉండటంతో ఫండ్ మేనేజర్లు అప్రమత్తమయ్యారు.

## నగదు నిర్వహణకు ఇబ్బంది లేకుండా

మ్యూచువల్ ఫండ్లు ప్రధానంగా అవసరమైనప్పుడు నగదుగా మార్చుకునే సదుపాయాన్ని (లిక్విడిటీ) నమ్ముకుని పనిచేస్తాయి. ఇప్పుడు భారీగా పెట్టుబడులు వచ్చి, ఆ తర్వాత మార్కెట్ అస్థిరత వల్ల ఒకేసారి ఉపసంహరణలు (రిడెంప్షన్) వస్తే, ఫండ్ సంస్థలు ఇబ్బందుల్లో పడతాయి. అందుకే, 'లిక్విడిటీ' నిర్వహణలో భాగంగానే పలు సంస్థలు తాత్కాలిక ఆంక్షలను అమల్లోకి తెచ్చాయి.

## వ్యత్యాసం రాకుండా

గోల్డ్ ఈటీఎఫ్‌ల ప్రధాన లక్ష్యం.. మార్కెట్లో బంగారం ధర పెరిగితే లేదా తగ్గితే.. అంతే శాతంలో ఈ ఫండ్ల విలువ (ఎన్‌ఏవీ) మారాలి. కానీ, భారీగా నగదు వచ్చి.. దానికి సరిపడా బంగారాన్ని వెంటనే కొనలేకపోతే.. ఆ డబ్బు ఫండ్ల వద్ద నగదు రూపంలో ఉండిపోతుంది. దీనివల్ల బంగారం ధరలకూ, ఈ ఫండ్ల ఎన్‌ఏవీలకూ మధ్య వ్యత్యాసం (ట్రాకింగ్ ఎర్రర్) వచ్చే ప్రమాదం ఉంది. ఇది ఫండ్ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది.

## లాభాల ఆశతో..

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి కారణంగా చాలా మంది మదుపరులు సురక్షిత పెట్టుబడిగా బంగారాన్ని చూస్తున్నారు. బంగారం ధరలు ఇంకా పెరుగుతాయనే ఆశతో, స్వల్ప కాలంలోనే పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఫండ్లు తమ పోర్ట్‌ఫోలియోను స్థిరంగా ఉంచుకునేందుకే ఇష్టపడతాయి. అతిగా, ఒక్కసారిగా వచ్చే నిధుల వల్ల ఫండ్ విలువ దెబ్బతినకుండా చూసేందుకు, నిలకడగా మదుపు చేసే చిన్న మదుపరులకే ప్రాధాన్యం ఇవ్వాలని ఫండ్ సంస్థలు భావిస్తున్నాయి.

## రిటెయిల్ మదుపరులకు నష్టం లేదు

మ్యూచువల్ ఫండ్ సంస్థల నిర్ణయం వల్ల సాధారణ, చిన్న మదుపరులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. గరిష్ఠంగా నెలకు రూ.10 లక్షల లోపు ఏకమొత్తం మదుపు చేసే వారికి అనుమతి ఉంటుంది. క్రమశిక్షణతో కూడిన పెట్టుబడులు (సిప్) చేస్తున్నవారికీ ఆటంకాలు ఏమీ లేవు. దీర్ఘకాలిక దృక్పథంతో బంగారంపై పెట్టుబడులు పెట్టేవారు యథావిధిగా కొనసాగించొచ్చని వ్యక్తిగత ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

Display: 2/2